వేధిస్తున్న డ్రెయినేజీ సమస్య

- రోడ్డుపైనే నిలుస్తున్న మురుగు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- అమలుకాని పాలకుల హామీలు

కట్టంగూర్ : మండల కేంద్రంలోని జాతీయ రహదారి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే బాట వరకు కల్మెర రోడ్డు వెంబడి డ్రెయినేజీ లేక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. కల్మెర రోడ్డులోని కృష్ణాజలాల మినీ ట్యాంకు సమీపంలో, ఏపీజీవీబీ సమీపంలో రోడ్డుపై వర్షపు నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ఇదే రోడ్డు వెంబడి రెండు వైన్స్ దుకాణాలు ఉండడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు పలు పనుల నిమిత్తం తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలకు, పోస్టాఫీస్‌కు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి ఈ దారిగుండానే రాకపోకలు సాగిస్తుంటారు. ఈదులూరు, పరడ, పందెనపల్లి, కల్మెర, మునుకుంట్ల, కుమ్మరిగూడెం, తక్కెళ్లపాడుతో పాటు శాలిగౌరారం మండల ప్రజలు ఈ దారిగుండా నల్లగొండకు రాకపోకలు సాగిస్తారు. మోకాలు లోతు గుంతల్లో వర్షపు నీరు నిలిచి ఏర్పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రిపూట ఈ దారి గుండా వెళ్లేందుకు వాహనదారులు జంకుతున్నారు. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారే తప్ప పనులు మాత్రం చేపట్టడం లేదని ఆ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే రూ.కోటి నిధులతో కల్మెర రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మిస్తానని పలుమార్లు హామీ ఇచ్చారే తప్ప అమలు కావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.


కల్మెర రోడ్డులో డ్రెయినేజీ లేక రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు


కట్టంగూర్‌లో ఏపీజీవీబీ సమీపంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

సర్వీసు రోడ్డుపై నీటితో ఇబ్బందులు

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కట్టంగూర్‌లో సర్వీసు రోడ్డు వెంబడి నిర్మించిన డ్రెయినేజీ ఎత్తుగా ఉండడంతో వర్షపు నీరు రోడ్డుపై నిల్వ ఉంటోంది. మసీదు ప్రాంతంలో డ్రెయినేజీ అసంపూర్తిగా నిర్మించడంతో ప్రజలు పది సంవత్సరాలుగా నానా అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలో సర్వీసు రోడ్డుపై వర్షపునీరు నిల్వ ఉండి దారి గుండా వెళ్లే ప్రజలు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొద్దిపాటి వర్షం కురిసినా వారం రోజులపాటు సర్వీసు రోడ్డు పక్కనే నీరు నిల్వ ఉండడంతో రోడ్డు గుండా వెళ్లే ప్రజలు, చిరు వ్యాపారులు ఇబ్బందులకు గురవుతున్నారు.

డ్రెయినేజీ నిర్మించాలి



మండలకేంద్రంలోని కల్మెర రోడ్డు వెంబడి డ్రెయినేజీ లేక మురుగు నీరు రోడ్డుపైకి రావడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలంలో నీరు రోడ్డుపై నిలిచి గుంతలు ఏర్పడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పలుమార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డుకు రెండు వైన్ షాప్‌లు ఉండడంతో నిత్యం రద్దీగా ఉంటోంది. అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మించాలి.

–పెద్ది కళమ్మ, కట్టంగూర్

రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలి

నల్లగొండ టూటౌన్ : పట్టణంలో రోడ్డు విస్తరణ, డ్రెయినేజీల నిర్మాణ పనులు సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ పట్టణంలోని భాస్కర్ టాకీస్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు వివిధ శాఖల అధికారులతో కలిసి నడుచుకుంటూ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచాలని, డివైడర్ల నిర్మాణం, డ్రెయినేజీలు ఏకకాలంలో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వచ్చేనెలలో సీఎం కేసీఆర్ పర్యటన ఉన్నందున అధికారులు నితరంతర పర్యవేక్షణ చేస్తూ పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. పాత కరెంట్ పోల్స్ వెనక్కి జరిపించాలని, కొత్త పోల్స్ వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా పెద్ద బండ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మున్సిపల్ కమిషన్ కేవీ.రమణాచారి, ఈఈ రాములు, కౌన్సిలర్లు అభిమన్యు శ్రీనివాస్, ఎడ్ల శ్రీనివాస్, సమి, మాతంగి సత్యనారాయణ, పున్న గణేష్, పూజిత శ్రీను, నాయకులు రావుల శ్రీనివాస్‌రెడ్డి, జమాల్‌ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల

దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నల్లగొండ టూటౌన్ : దళితులపై దాడులను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పోతెపాక సాంబయ్య అన్నారు. హైదరాబాద్‌లోని మలక్‌పేట పోలీస్ స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించి చికిత్స పొందుతూ మృతి చెందిన విజయ్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో స్థానిక సుభాష్ విగ్రహం ఎదుట ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి రూ. 50 లక్షల పరిహారం, డబుల్‌బెడ్ రూం ఇళ్లు, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాసోజు యాదగిరి, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, బాకి నర్సింహ, దేవేందర్, నరేందర్‌రెడ్డి, ప్రమోద్‌కుమార్, రుక్మాగౌడ్, ఏరుకొండ హరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్


మల్లికార్జున్

నల్లగొండ రూరల్ : నీలగిరి పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఇంగ్లిష్ అధ్యాపకుడు మల్లికార్జున్‌కు గురువారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని మోనాడు యూనివర్సిటీ ఇంగ్లిష్‌లో డాక్టరేట్ ప్రకటించింది. ఆన్ ఎనలిటికల్ స్టడీ ఆన్ ఎక్స్‌ప్లోరింగ్ ఫెమినైన్ సప్రేషన్ అండ్ ప్యాట్రియార్కి ఇన్ ద ఇండియన్ సొసైటీ విత్ ద హెల్ప్ ఆఫ్ సెలెక్టెడ్ ఫిమేల్ అథర్స్ అనే అంశంపై డాక్టర్ అజిత్‌కుమార్ పర్యవేక్షణలో పరిశోధన చేసినందుకు డాక్టరేట్ లభించింది. మల్లికార్జున్ డాక్టరేట్ పొందడంపై కళాశాల ప్రిన్సిపాల్ ఘనశ్యాం, వైస్ ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపకులు దేవవాణి, లైబ్రేరియన్ డా . రాజారాణి, రవిచంద్ర భాస్కర్‌రెడ్డి అభినందించారు.

ఎన్‌ఆర్‌ఐ వితరణ

కనగల్ : మండల పరిధిలోని పగిడిమర్రి గ్రామంలో రెండేళ్ల క్రితం గ్రామస్తులు, దాతల సహకారంతో రూ.కోటిగా పైగా డబ్బులు సేకరించి శ్రీ సీతారామచంద్రస్వామి, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాలను నిర్మించారు. అప్పటినుంచి గ్రామానికి చెందిన సుంకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి కుమారులు వెంకట్‌రెడ్డి (ఎన్‌ఆర్‌ఐ), మధుసూదన్‌రెడ్డి ఆలయంలో పనిచేస్తున్న అర్చకులకు ప్రతి నెల రూ.8000 అందజేస్తున్నారు. ఈ క్రమంలో వారు పంపిన నగదును అర్చకుడు శ్యాంకు గురువారం సర్పంచ్ గోలి నర్సిరెడ్డి అందజేశారు.

ఎమ్మెల్సీ నిధులు మంజూరు


నిధుల మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ దయానంద్

చండూరు : గట్టుప్పల సర్పంచ్ ఇడెం రోజా వినతి మేరకు గట్టుప్పల మండల కేంద్రంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.10 లక్షలు (సీడీఎఫ్ 2023–24) తన నిధులు కేటాయిస్తూ ఎమ్మెల్సీ దయానంద్ మంజూరు పత్రాన్ని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ ఇడెం కైలాసంకు గురువారం హైదరాబాద్‌లో అందజేశారు. మండల కేంద్రంలో 2వ వార్డుకు రూ.5 లక్షలు, కొండపల్లి నర్సింహ ఇంటి నుంచి మునుకుంట్ల గాలయ్య ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి మరో రూ.5 లక్షలు కేటాయించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు పెదగాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

12న చలో హైదరాబాద్

నల్లగొండ టూటౌన్ : సీపీఎస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీఎస్ సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శిరందాసు రామదాసు కోరారు. గురువారం నల్లగొండ పట్టణంలోని ఉద్యోగుల సంఘం కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో తలపెట్టిన కార్యక్రమానికి అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు తరలిరావాలని కోరారు. నాగవెల్లి ఉపేందర్, సురేందర్‌సింగ్, విజయ్, పంకజ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

కరపత్రాలు అందజేత


కరపత్రాలు అందజేస్తున్న దైద రవీందర్

నకిరేకల్ : ఇంటింటికీ కాంగ్రెస్ పార్టీ హామీల పత్రం కార్యక్రమంలో భాగంగా గురువారం నకిరేకల్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జ్ దైద రవీందర్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను అందజేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే హామీలనీన అమలుచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూసుఫ్, అబ్దుల్ మాజీద్, సతీష్, రాజశేఖర్, మహేష్, సురేష్, జావిద్, నక్షత్, వెంకటేష్, నాగరాజు, జాని, మహేష్, రమేష్ తదితరులు ఉన్నారు.

కృష్ణా జలాల పైప్‌లైన్ లీకేజీ


రాంరెడ్డిపల్లిలో లీకవుతున్న కృష్ణాజలాలు

మర్రిగూడ : మండల పరిధిలోని రాంరెడ్డిపల్లి గ్రామ బస్టాండ్ ఎదుట పది రోజుల నుంచి కృష్ణాజలాల పైప్‌లైన్ లీకేజీ అవుతోంది. నీటి సరఫరా సమయంలో పైప్ లీకేజీ అయ్యి నీరు ప్రధాన రోడ్డు వెంట ప్రవహిస్తోంది. నిత్యం నీరు లీకేజీ అవుతుండడంతో ఆ ప్రాంతమంతా బురదమయమై దోమలు ప్రబలి సీజనల్ వ్యాధులు సంభవించే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నాడు 9.8.. నేడు 10/10 జీపీఏ

చండూరు : కనగల్ మండలం రేగట్టె గ్రామానికి చెందిన గొలనుకొండ వెంకన్న కుమారుడు శ్రవణ్ చండూరు గాంధీజీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో చదివి 2022–23 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ పరీక్షలు రాశాడు. ఫలితాల్లో 9.8 జీపీఏ వచ్చింది. రీ కౌంటింగ్‌కు ధరఖాసు చేసుకోగా అన్ని సబ్జెక్టుల్లో 10/10 జీపీఏ వచ్చినట్లు గురువారం పోస్ట్ ద్వారా మార్కుల లిస్ట్ అందింది. ఇదే ముందుగా పరీక్ష ఫలితాల్లో 10 గ్రేడ్ వస్తే తనకు బాసర ట్రిపుల్ ఐటీ వచ్చేదని విద్యార్థి ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సెస్సీ బోర్డు తప్పిదం వల్లే తాను నష్టపోయాయని, బాధ్యులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరాడు.

ఆర్థికసాయం అందజేత


మునుగోడు : చెక్కు అందిస్తున్న బీజేపీ నాయకులు

సాక్షి ఎఫెక్ట్..

మునుగోడు : మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ జాజుల వెంకటయ్య నోటి క్యాన్సర్‌తో బాధపడుతూ మంచానికి పరిమితమయ్యాడు. ఆ కుటుంబ దీన గాథను తెలియజేస్తూ 'పూట గడవని కుటుంబానికి ఆపద' అనేక కథనం బుధవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైంది. సాక్షి కథనాన్ని వాట్సాప్ గ్రూపుల్లో చూసిన మునుగోడు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వెంటనే స్పందించారు. వెంకటయ్య వైద్య ఖర్చుల నిమిత్తం లక్ష రూపాయల విలువ గల చెక్కును ఆ గ్రామానికి చెందిన బీజేపీ నాయకుల ద్వారా వెంకటయ్య భార్యకు గురువారం అందించారు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన పంతంగి సంధ్య అనే మహిళ భర్త రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ.50వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కిష్టాపురం సర్పంచ్ నందిపాటి రాధరమేష్, బీజేపీ జిల్లా కార్యదర్శి వేదాంతం గోపీనాథ్, మునుకుంట్ల మ ల్లయ్య, బోయ సురేష్, కృష్ణయ్య, భీమనపల్లి సా యిబాబా, రాజశేఖర్ రెడ్డి, కొండల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కంచర్ల ఆర్థికసాయం

కనగల్ : మండల పరిధిలోని జంగమయ్యగూడెం గ్రామానికి చెందిన ఆదిమల్ల పెద్దులమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పంపిన రూ.10 వేల ఆర్థికసాయాన్ని గురువారం ఎంపీపీ కరీంపాష అందజేశారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, జొన్నలగడ్డ శేఖర్‌రెడ్డి, సర్పంచ్ కన్నెబోయిన సతీష్, కన్నెబోయిన అంజి, నల్లబోతు శంకర్, ఆదిమల్ల పరమేష్, సైదులు, పాపయ్య తదితరులున్నారు.

ముగిసిన గృహలక్ష్మి దరఖాస్తుల ప్రక్రియ

శాలిగౌరారం : రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లులేని పేద ప్రజలకు ఇంటి నిర్మాణం చేసుకునేందుకు ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. దరఖాస్తుల స్వీకరణ మంగళవారం ప్రారంభం కాగా గురువారంతో ముగిసింది. మూడు రోజులపాటు జరిగిన దరఖాస్తుల స్వీకరణలో మండలంలో 2773 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ పాల్‌సింగ్ విలేకరులకు తెలిపారు. మీ సేవ కేంద్రాల నిర్వాహకులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం రూ.45 తీసుకోవాల్సి ఉండగా ఒక్కొక్క ధ్రువీకరణ పత్రానికి రూ.200 వసూలు చేసినట్లు పలువురు దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు

నల్లగొండ టూటౌన్ : తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండ పట్టణంలోని యూటీఎఫ్ భవన్‌లో హైదరాబాద్‌లోని మహాలక్ష్మి కంటి ఆస్పత్రి వారు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నూకల జగదీష్‌చంద్ర, పందిరి శ్యాంసుందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కేసీఆర్ పాలనలో గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం


చిట్యాల : శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి

చిట్యాల : సీఎం కేసీఆర్ పాలనతో గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చి నిధులు మంజూరు చేస్తున్నారని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తెలిపారు. మండలంలోని ఆరెగూడెం గ్రామంలో రూ.10 లక్షలు, పెద్దకాపర్తిలో రూ..15 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో అవినీతి రహిత పాలన కొనసాగుతోందని అన్నారు. ఎంపీపీ కొలను సునిత, జెడ్పీటీసీ సుంకరి ధనమ్మ, ఏఎంసీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, పెద్దకాపర్తి సర్పంచ్ మర్రి జలంధర్‌రెడ్డి, ఆరెగూడెం సర్పంచ్ అర్రూరి లాలమ్మ, పీఏసీఎస్ చైర్మన్ రుద్రారపు భిక్షం, తిరుమలనాథ స్వామి ఆలయ చైర్మన్ బాలగోని రాజుగౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆవుల అయిలయ్య, ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. చిట్యాల పట్టణానికి చెందిన వివిధ పార్టీల నాయకులు గురువారం నార్కట్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. పార్టీలో చేరినవారిలో బొల్లూరి సైదులు, మోత్కూర్ వెంకన్న, ఈశ్వర్, శంకరయ్య, యాదమ్మ, సిలివేరు లింగమ్మ, బైరు మంగమ్మ, జిట్ట నరేష్‌తో పాటు మరో వంద కుటుంబాలున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి, ఏఎంసీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మెండె సైదులు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్య, జగిని భిక్షంరెడ్డి, జిట్ట చంద్రకాంత్, చిత్రగంటి ప్రవీణ్, మేడి రాజు, జాల ప్రకాష్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరిక

కట్టంగూర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. గురువారం మండలంలోని ఇస్మాయిల్‌పల్లి గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు నార్కట్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పులిగిల్ల వెంకన్న, అలుగుబెల్లి శేఖర్ రెడ్డి, మేడబోయిన ఆంజనేయులు, రేకల భిక్షం పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో పెంజర్ల ముత్తయ్య, లింగయ్య, పులిగిల్ల అంజి, బండారు శంకర్, నాగేష్, నర్సింహ, శ్రావణ్, రాకేష్, నవీన్, సైదులు, నాగరాజు ఉన్నారు.

రెగ్యులరైజ్ చేయాలని ఏఎన్‌ఎంల ఆందోళన

కేతేపలి : తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో పని చేస్తున్న స్టాఫ్ నర్సులు, రెండో ఏఎన్‌ఎంలు గురువారం కేతేపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. ఈసందర్భంగా పలువురు ఏఎన్‌ఎంలు మాట్లాడుతూ వైద్య శాఖలో 16 ఏళ్లుగా అతి తక్కువ వేతనాలతో పనిచేస్తూ పేదలకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. తమ ఉద్యోగాలను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయకుండా ఏఎన్‌ఎంల భర్తీ కోసం కొత్తగా నోటిఫికేషన్ జారీ చేయడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం స్పందించి పరీక్షలతో సంబంధం లేకుండా తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. స్టాఫ్ నర్స్ జి.శశిరేఖ, ఏఎన్‌ఎంలు బి.హరిత, జయంతి, సుశీల, సువర్ణ, సత్తమ్మ, ఉప్పలమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు

అధికారంలోకి రాగానే నిరుద్యోగ భృతి ఇస్తాం


మాట్లాడుతున్న చలమల్ల కృష్ణారెడ్డి

నాంపల్లి : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిరుద్యోగ భృతి అందిస్తామని మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ చలమల్ల కృష్ణారెడ్డి అన్నారు. మండలంలో మేళ్ళవాయి, ఫకీర్‌పూర్, సుంకిశాల, ముష్టిపల్లి, దేవత్‌పల్లి, రేఖ్యతండా గ్రామాల్లో రెండోరోజు జరిగిన ప్రజాచైతన్య యాత్రలో ఆయన మాట్లాడారు. రైతు బంధు కింద రూ.15వేలు అందిస్తామని అన్నారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చిందని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో 9 సంవత్సరాలుగా ఉండి ఒక్క పేదవాడికి కూడా ఇల్లు కట్టించలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్, మండల అధ్యక్షుడు కొమ్ము భిక్షం, చాందుపాష, పానగంటి వెంకటయ్య, వెంకట్‌రెడ్డి, మట్టిపల్లి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు!

మునుగోడు : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గృహలక్ష్మి పథకం అమలుకోసం అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు కోరింది. దరఖాస్తు పత్రాలతోపాటు తమ ఇంటి స్థల పత్రాలను జతచేసి దరఖాస్తు సమర్పించాలని ప్రభుత్వం సూచించడంతో కొందరు పైరవీకారులు అమాయక ప్రజల నుంచి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారు. మునుగోడులో అనేక మందికి తమ ఇంటి నివాస స్థలాల ధ్రువీకరణ పత్రాలు లేకపోవ్వ. దీంతో ధ్రువీకరణ పత్రాలు ఇప్పిస్తామని కొందరు పైరవీకారులు ఒక్కొక్కరి దగ్గర రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయం తెలిసిన గ్రామ పంచాయతీ అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు.. కొందరు తమను ఇబ్బంది పెట్టడానికి డబ్బులు వసూలు చేస్తున్నారని, ఈ విషయంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొంటున్నారు. దరఖాస్తుదారులు ఏ ఒక్కరికి డబ్బులు ఇచ్చి మోసపోవద్దని సూచిస్తున్నారు.

సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేయాలి

మిర్యాలగూడ టౌన్ : సాగర్ ఎడమ కాలువ పరిధిలోని ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలని కోరుతూ గురువారం బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఎన్ఎస్‌పీ ఈఈ కార్యాలయ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర అధికార కోశాధికారి కన్మంతరెడ్డి అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఎడమ కాలువ పరిధిలోని ఆయకట్టుకు సాగు నీరు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు.సాగు నీరు అందించాలని, లేకుంటే బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాణావత్ రతన్‌సింగ్‌నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు రామచంద్రారెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు దొండపాటి వెంకట్‌రెడ్డి, దామరచర్ల మండల అధ్యక్షుడు జానకిరామ్‌రెడ్డి, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు శేఖర్ తదితరులున్నారు.

వైభవంగా ముత్యాలమ్మ బోనాల వేడుకలు


నకిరేకల్ : నోములలో బోనంతో వెళ్తున్న ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి, తదితరులు


కట్టంగూర్ : చెర్వుఅన్నారం గ్రామంలో..


శాలిగౌరారం : ఆకారం గ్రామంలో..

నకిరేకల్ : బోనాల పండుగ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక అని నకిరేకల్ ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవిగంగాధర్‌రావు అన్నారు. నోముల గ్రామంలో గురువారం నిర్వహించిన ముత్యాలమ్మ బోనాల వేడుకల్లో ఆమె పాల్గొని బోనం ఎత్తుకుని ర్యాలీగా వచ్చి ముత్యాలమ్మకు బోనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజలు సంతోషంగా వేడుకలు జరుపుకోవాలన్నారు. ఎంపీటీసీ సామ బాలమ్మ, సామ రవీందర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, నాగరాజు, రఘు, శ్రీధర్, గోపి, వినయ్, లింగారెడ్డి, జాన్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, చంద్రారెడ్డి, నారాయణ తదితరులు ఉన్నారు.

కట్టంగూర్ : ముత్యాలమ్మ, మారమ్మ, మైసమ్మ పండుగలను గురువారం మండలంలోని మునుకుంట్ల, చెర్వుఅన్నారం గ్రామ ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు నూతన పట్టు వస్త్రాలు అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు నూతన వస్త్రాలు ధరించి బోనాలు ఎత్తుకెళ్లి ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలను నైవేద్యంగా సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం గ్రామదేవత ముత్యాలమ్మ బోనాల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముత్యాలమ్మ ఆలయాల వద్ద స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

చండూరు : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీపీ పల్లె కళ్యాణి అన్నారు. గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు స్థానిక పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆరోగ్య లక్ష్మి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పోషక విలువలు కలిగిన ఆహారాన్ని చిన్నారులకు క్రమం తప్పకుండా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యాకూబ్‌నాయక్, మున్సిపల్ కమిషనర్ మొయిజుద్దిన్, కౌన్సిలర్ తోకల వెంకన్న, డాక్టర్ రాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుజాత, శివేష తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూర్‌వైజర్లు భవాని, జ్యోతి, అంగన్‌వాడీ టీచర్ స్వరూపరాణి, వైద్య సిబ్బంది భాస్కర్, మయూరి, ఆశవర్కర్ గుణవతి, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని షాపెల్లి గ్రామంలో విద్యార్థులతో అంగన్‌వాడీ టీచర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కరుణ, లలిత, ఉపాధ్యాయులు సురేష్, శ్రీనివాస్ ఉన్నారు.


చండూరు : గర్భిణులకు ఆరోగ్య లక్ష్మి భోజనాలు వడ్డిస్తున్న ఎంపీపీ కళ్యాణి, ఎంపీడీఓ

మర్రిగూడ : తల్లిపాల వారోత్సవంలో భాగంగా గురువారం మండలంలోని కుదబాక్షపల్లి పరిధిలోని బండకిందితండా అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. చింతపల్లి సీడీపీఓ లావణ్యకుమారి, సూపర్‌వైజర్ మిర్యాల పద్మ, అంగన్‌వాడీ టీచర్ సుగుణ, వార్డు మెంబర్ పూలమ్మ, ఆశ వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఓబీసీ సెల్ అధ్యక్షుడిగా సైదులు


నియామకపత్రం అందజేస్తున్న జిల్లపల్లి పరమేష్

నల్లగొండ : కాంగ్రెస్ పార్టీ నల్లగొండ నియోజకవర్గ అధ్యక్షుడిగా కనగల్ మండలానికి చెందిన ఆకటి సైదులు నియమితులయ్యారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో సైదులుకు కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు జిల్లపల్లి పరమేష్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ ఆదేశాల మేరకు నల్లగొండ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఆకటి సైదులును నియమించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆదిమల్ల శంకర్, అల్లి సుభాష్‌యాదవ్, సుంకిరెడ్డి వెంకట్‌రెడ్డి, పిన్నపురెడ్డి జాన్‌రెడ్డి, చర్లపల్లి గౌతమ్, పుట్ట చందు, గొని నరేష్, పాలకూరి సైదులు, కుంటిగోర్ల కృష్ణ, సందీప్, పుల్లెంల మహేష్ గౌడ్, గుండబోయిన రాంబాబు, అనుముల నరేందర్, ఎండీ నజీర్, కొండేటి సందీప్‌రెడ్డి, రాయల వెంకన్న, పోలగోని సైదులు, వంగాల అనిల్‌రెడ్డి, కప్పి రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గడువు పెంచాలని వినతి

రామగిరి(నల్లగొండ) : గృహలక్ష్మి పథకానికి దరఖాస్తుల గడువు పెంచాలని కోరుతూ సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నన్నూరి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో సీపీఎం నాయకులు గురువారం తిప్పర్తి తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సైదులుకు వినతి పత్రం అందజేశారు. భీమగాని గణేష్, పోకల శేఖర్, మైల సైదులు, జానయ్య, దశరథ, సైదులు, భిక్షం, నూర్ మహమ్మద్, కోటిరెడ్డి, నాగరాజు, కల్పన, సైదమ్మ, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

నోట్‌పుస్తకాలు అందజేత

కనగల్ : మండల పరిధిలోని రేగట్టె ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన వేముల చంద్రమౌళి జ్ఞాపకార్థం ఆయన భార్య మంగతాయమ్మ, కూతురు గీతాంజలి, అల్లుడు శివలు గురువారం నోట్ పుస్తకాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పగిళ్ల సైదులు, ఏర్రోల్ల సురేష్, ఉపాధ్యాయులు సంతోష, పద్మ, శివన్‌గౌడ్ తదితరులున్నారు.


నోట్ పుస్తకాలతో విద్యార్థులు